క్లుప్తంగా

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత



స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులతో సిబ్బంది

కౌటాల: మండలంలోని ముత్తంపేట ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా అధికారులు స్కాలర్‌షిప్‌లు అందించినట్లు పాఠశాల హెచ్‌ఎం నానాజీ తెలిపారు. పాఠశాలకు చెందిన ఆదే సంధ్య, ఆదే అంజలి అనే విద్యార్థులు గతేడాది 9వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా మెరిట్ స్కాలర్‌షిప్ అందించినట్లు పేర్కొన్నారు. సంధ్యకు మొదటి బహుమతిగా రూ.5 వేలు, అంజలికి ద్వితీయ బహుమతిగా రూ.3500 నగదు అందించారన్నారు. మెరిట్ స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

లక్కీడ్రాతో లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కెరమెరి: మైనార్టీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారులను లక్కీడ్రాతో ఎంపిక చేయాలని ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ దుర్పత బాయి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. మండలంలో మూడు యూనిట్లకు సుమారు 300 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని, వాటన్నింటికి స్క్రూటినీ చేయాలంటే కష్టమైన వ్యవహారమని పేర్కొన్నారు. లబ్ధిదారులను లక్కీడ్రాతో ఎంపిక చేయాలని సూచించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తానని ఎంపీడీవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇష్తేకార్, ఉపసర్పంచ్ నిసార్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వాంకిడి: మండలంలోని అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ రహీముద్దీన్‌కు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవిలు సోమవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఖమాన, బంబార, వాంకిడి, బెండార గ్రామాల శివారు వ్యవసాయ భూముల్లో అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా క్రయవిక్రయాలు జరుపుతున్నారని, గ్రామ పంచాయతీల సహకారంతో జరుగుతున్న ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

22న గోండ్వాన గణతంత్ర పార్టీ సమావేశం



మాట్లాడుతున్న బాపురావు

వాంకిడి: ఈనెల 22న బుధవారం మండలంలోని నాధరి గ్రామ పంచాయతీ కేంద్రంలో గ్రామ పటేల్ ఇంటి ఆవరణలో గోండ్వాన గణతంత్ర పార్టీ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బావునె బాపురావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగ పరమైన హక్కులు పొందేందుకు ఆదివాసీల నాయకత్వాన ఏర్పడిన ఏకైక పార్టీ గోండ్వాన గణతంత్ర పార్టీ అన్నారు. బుధవారం గ్రామ పటేల్ ఇంటి ఆవరణలో సమావేశం నిర్వహించి పార్టీ జెండా ఆవిష్కరణతో పాటు మండల కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు సమావేశానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేశవరావు, జిల్లా అధ్యక్షుడు సందీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని తండ్లాట!



రాళ్ల కన్నెపెల్లి గ్రామంలో నిరుపయోగంగా నల్లా

తిర్యాణి: మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఇంటింటికీ మంచి నీళ్లు అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో గ్రామాలకు నీరందక ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. కాలమేదైనా కాలినడకన చేతిపంపులు, బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి గ్రామాల్లో నెలకొంది. అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నామని అధికారులు లెక్కల్లో చూపిస్తున్నా వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.

- గ్రామాలకు చేరుకోని మిషన్‌భగీరథ నీరు
- చేతి పంపులు, బావుల నీళ్లే దిక్కు
- ఇబ్బందుల్లో మండలవాసులు
- పైప్‌లైన్ లీకేజీలతో పరేషాన్



పంగిడిమాదర గ్రామంలో అలంకారప్రాయంగా ఉన్న ట్యాంకు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..

మండలంలో 29 గ్రామపంచాయతీలుండగా 120 అనుబంధ గ్రామాలున్నాయి. కాగా ఇప్పటికే మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ పథకంలో భాగంగా వాటర్ ట్యాంకులు, ఇంటింటికీ నల్లాలు ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటికీ మండలంలోని సగానికి పైగా గ్రామాలకు నీరు అందడం లేదు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులకు వాటర్‌గ్రిడ్ ద్వారా అడపాదడపా నీటి సరఫరా జరుగుతున్నా వాటర్ ట్యాంకుల నుంచి ఇళ్లకు ఏర్పాటు చేసిన నల్లాలకు మాత్రం నీటి సరఫరా జరగడం లేదు. దీంతో నల్లాలు అలంకారప్రాయంగా మారుతున్నాయి. కాగా గ్రామాల్లో చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణాల్లో సదరు కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో లీకేజీలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో నల్లాలకు నీరు అందడం లేదు. లీకేజీ పనులను కాంట్రాక్టర్ మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా బిల్లులు రావడం లేదనే సాకుతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఇంటింటికీ నీరు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

వేసవికైనా నీరందేనా..?

మండలంలోని ఉల్లిపిట్ట, కొత్త దంతన్‌పెల్లి, ఓంటి మామిడి, జెండాగూడ, భీంజిగూడ, పంగిడిమాదర, బుగ్గగూడ, తాటి మాదర, కేరిగూడ, మంగి, కొలంగూడ, మాలగూడ, గడలపెల్లి, రాళ్ల కన్నెపెల్లి, చందుగూడ, చోపిడి, తోయగూడ గ్రామాలతో పాటు వివిధ గ్రామాల్లో తాగునీటి కటకట నెలకొంది. ఆయా గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయంతో పనులను వెంటనే ప్రారంభించి మరమ్మతులు చేస్తే తప్పా వేసవిలో నీళ్ల కష్టాలు తీరే పరిస్థితి లేదు. గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్యపై ఇటీవల నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో చర్చించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. మండలంలోని సగానికి పైగా గ్రామాలకు నీటి సరఫరా జరుగుతుందని సభలోనే అధికారులు పేర్కొనగా, 20శాతం గ్రామాలకు కూడా నీరు అందడం లేదని ప్రజాప్రతినిధులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. వేసవిలో నీటి కష్టాలు లేకుండా అధికారులు ఎలాంటి చర్యలు చేపడుతారనేది వేచి చూడాల్సిందే.

నీటి సరఫరా చేపట్టాలి

రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకోని మండలంలోని అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలి.మండలంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను చేపట్టిన కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి.ఎన్నిసార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లిన ఎవరు కుడా పట్టించుకోవడం లేదు.

– కోట్నాక గణపతి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఆదివాసీ సర్పంచుల సంఘం

నీరందేలా చర్యలు తీసుకుంటాం

వీలైనంత త్వరగా మండలంలోని అన్ని గ్రామాలకు నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపడుతాం. పైప్‌లైన్ లీకేజీల కారణంగా కొన్ని గ్రామాల్లో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించి వేసవిలో నీటి కష్టాలు లేకుండా చూస్తాం.

– కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, తిర్యాణి

రోడ్డుపై మట్టి.. ప్రయాణికుల అవస్థలు



రోడ్డుపైనే వదిలేసిన మట్టి



ముత్తంపేట సమీపంలో రోడ్డు పక్కన తవ్విన కాలువ

చింతలమానెపల్లి: నియోజకవర్గంలోని గ్రామాల్లో సమాచార వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు జరుగుతున్న పనుల్లో నిర్లక్ష్యం కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సిర్పూర్ నియోజవర్గంలో గ్రామాల మధ్య పైపులైన్ సహాయంతో బ్రాడ్‌బ్యాండ్ కేబుల్ అనుసంధానం చేస్తున్నారు. చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్ నుంచి కౌటాల వరకు, కౌటాల మండల కేంద్రం నుంచి సిర్పూరు వెళ్లే మార్గంలో బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థ ఆధ్వర్యంలో పనులు కొనసాగుతున్నాయి. పనుల్లో భాగంగా రహదారుల పక్కన తవ్వుతున్న కాలువ మట్టిని తోడి రోడ్డుపైనే వేస్తున్నారు. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. హెచ్చరిక బోర్డులు లేకుండా నిర్వహిస్తున్న పనులను గుర్తించలేక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు పనులు పూర్తి చేసిన చోట రోడ్డుపై మట్టిని తొలగించకపోవడంతో ద్విచక్రవాహనాలు జారిపడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు వెంటనే స్పందించి రహదారిపై మట్టిని పూర్తిస్థాయిలో తొలగించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీరోడ్లకు భూమిపూజ



కెరమెరి: సీసీరోడ్డు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామంలో సీసీరోడ్లకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సోమవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గ్రామ పంచాయతీలోని పోచమ్మవాడ, డబ్బా క్రాస్‌రోడ్ సమీపంలోని కాలనీలలో సీసీరోడ్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ రహదారుల నిర్మాణంతో గ్రామస్తుల ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. ఆయన వెంట ఎంపీపీ డుబ్బుల నానయ్య, ఎంపీడీవో మహేందర్, ఏపీవో గోవర్ధన్, ఉపసర్పంచ్ సావిత్రి తదితరులు ఉన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: మండలంలోని బారేమోడి గ్రామంలో సోమవారం సీసీరోడ్డు పనులను ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.4 లక్షల నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. సర్పంచ్ మోహర్లే సుమన్‌బాయి తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు

వాంకిడి: నవేగాం గ్రామ పంచాయతీ పరిధిలోని కమలాపూర్ గ్రామంలో గల శివశంకరుని ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. సోమవారం కమలాపూర్‌లో నిర్వహించిన శ్రీ శివశంకర భవ్య జాతరలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో భాగంగా భక్తుల సౌకర్యార్థం ఒక షెడ్డుతో పాటు తాగునీటికి బోరింగు వేయించినట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటీ కోరిక మేరకు భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మడావి బాలు, ఐటీడీఏ డైరెక్టర్ సోయం బాపురావు, టీఆర్‌ఎస్ నాయకుడు దీపక్ ముండె, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పటేల్లు పాల్గొన్నారు.

ముగిసిన భద్రకాళీ జాతర



పెంచికల్‌పేట్: మండలంలోని పంచకళపురి క్షేత్రంలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో మూడు రోజులుగా కొనసాగుతున్న జాతర సోమవారం ముగిసింది. చివరిరోజు ఆలయంలో ప్రభల ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఊరేగింపును తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా మౌలిక వసతులు



పాఠశాలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు, కలెక్టర్ హేమంత్ బోర్కడే, అధికారులు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

రెబ్బెన: మన ఊరు మన బడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు వసతులు ఏర్పడుతున్నాయని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కులు అన్నారు. మండలంలోని పుంజుమేర గూడ, గంగాపూర్‌లలో మన ఊరు మన బడిలో భాగంగా పాఠశాలలను సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయని, విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. పుంజుమేరగూడ పాఠశాలలో రూ.9.59 లక్షలు, గంగాపూర్‌లో రూ.32.63 లక్షలతో వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డీఈవో అశోక్, జెడ్పీటీసీ సంతోష్, ఎంపీపీ సౌందర్య, సర్పంచులు అహల్యాదేవి, వినోద, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంఈవో వెంకటేశ్వరస్వామి, ఎంపీటీసీలు మనుధనయ్య, హరిత, శ్రీనివాస్, సర్పంచ్ సోమశేఖర్, సంజీవ్‌కుమార్, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

కాగజ్‌నగర్‌టౌన్: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్‌లో గల పట్టణ ప్రకృతివనంతోపాటు సెగ్రిగేషన్ షెడ్డు, వైకుంఠధామాన్ని సోమవారం మున్సిపల్ కమిషనర్ అంజయ్యతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. సెగ్రిగేషన్ షెడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని, ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలి

వాంకిడి: ఇంటి స్థలాలతోపాటు డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ వాంకిడి మండల జర్నలిస్టులు సోమవారం ఆసిఫాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి వినతిపత్రం అందజేశారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

వాంకిడి: విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బకాయిలు చెల్లించాలని డీఈ ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. వాంకిడి మండలంలో సుమారు రూ. 2కోట్ల విద్యుత్ బిల్లుల బకాయిలు ఉన్నాయన్నారు. వినియోగదారులు సహకరించి వెంటనే బిల్లులు చెల్లించాలని కోరారు. ఈనెల 21న డివిజన్ కేంద్రం నుంచి బకాయిల వసూలు నిమిత్తం ప్రత్యేక బృందాలు వస్తున్నట్లు తెలిపారు.

నేడు ఇంటర్వ్యూలు

దహెగాం: మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 11 గంటలకు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

'పాల్వాయి' హయాంలోనే అభివృద్ధి



బెజ్జూర్: మాట్లాడుతున్న పాల్వాయి హరీష్‌బాబు

బెజ్జూర్: స్వర్గీయ పాల్వాయి పురుషోత్తం రావు హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందని బీజేపీ సిర్పూర్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండలంలోని కుశ్నేపల్లి, పాపన్‌పేట్, సోమిని గ్రామాల్లోని శక్తి కేంద్రాల్లో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి చేసిన ఘనత పురుషోత్తం రావుదేనన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు దిగంబర్, ఇన్‌చార్జి సమీర్ గుప్తా, దళితమోర్చ జిల్లా అధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, నాయకులు రామయ్య, శంకరయ్య, వసీ ఉల్లాఖాన్, తిరుపతి, రాజారాం, నారాయణ, కిష్టయ్య, శ్యామ్‌సుందర్, నారాయణ, నందరాం, రమేష్, సత్యవాన్, ఎల్ములే తిరుపతి, సప్తగిరి, చంటి, ప్రభాకర్, నాణయ్య, సీతారాం పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ పట్టణంలో..

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని సంజీవయ్య కాలనీ, నౌగాం బస్తీలలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ పట్టణం ఒక మురికి కూపంలా తయారైందని, ప్రధాన రహదారి గుండా విపరీతమైన దుమ్ముతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని దుయ్యబట్టారు.

'పది' అంతర్గత మార్కుల పరిశీలన



కౌటాల: మార్కులు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: మండల కేంద్రంలోని మయూరి ప్రైవేట్ విద్యాలయం, ఇన్‌ఫంట్ జీసస్ ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కులను ఉపాధ్యాయుల బృందం అధికారులు పరిశీలించారు. విద్యార్థులకు నిర్వహించిన అంతర్గత మార్కుల రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. ఎఫ్‌ఏ1 మార్కులకు ఎఫ్1లోనే రౌండ్ ఆఫ్ చేయాలని స్థానిక హెచ్‌ఎంలకు సూచించారు. ఎఫ్‌ఏ2, ఎఫ్3, ఎఫ్4లకు కూడా వర్తిస్తుందని తెలిపారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గమనించాలని కోరారు. పరిశీలన బంధ్యంలో ఉపాధ్యాయులు గావుడే హన్మంతు, శ్యాంరావు, తదితరులు ఉన్నారు.

కాగజ్‌నగర్ పట్టణంలో..

కాగజ్‌నగర్‌టౌన్: పదో తరగతికి సంబంధించిన అంతర్గత మూల్యాంకన మార్కుల పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని కృష్ణవేణి హైస్కూల్‌తో పాటు అరుణోదయ విద్యాలయంలో విద్యార్థులకు సంబంధించిన ఫార్మేటివ్ అసెస్మెంట్, కరిక్యులర్ యాక్టివిటీస్‌కు సంబంధించిన రికార్డులను ఉపాధ్యాయులు పరిశీలించారు. పరిశీలనలో టీం లీడర్‌గా జెడ్పీఎస్‌ఎస్ బట్టుపల్లి ప్రధానోపాధ్యాయుడు తూడూరు నాగేశ్వరరావు, సభ్యులుగా డి.సత్యనారాయణ, హాదియా బేగం, పాఠశాల కరస్పాండెంట్ దోమల సువర్ధన్‌లు ఉన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి చూపాలి



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ పుష్పలత

బెజ్జూర్: యువత క్రీడలపై ఆసక్తి కనబర్చాలని జెడ్పీటీసీ పంద్రం పుష్పలత అన్నారు. సోమవారం మండలంలోని మర్తిడి గ్రామంలో కోనేరు యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టు ఆల్ వాలీబాల్ పోటీలను మండల కోఆప్షన్ సభ్యులు బషరత్ ఖాన్‌తో కలిసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు యువత క్రీడల్లోనూ రాణించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆటల్లో ప్రతిభ కనబర్చాలని పేర్కొన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ కుర్సింగ ఓంప్రకాష్, ఎంపీటీసీ గురజాల వెంకన్న, నాయకులు దుపం శ్రీనివాస్, అజీమ్ ఖాన్, ఈగ లక్ష్మినారాయణ, సత్య, శ్రీను, దేవన్న, శ్యామ్‌రావ్, శ్రీహరి, దుర్గయ్య, మీసాల దుర్గయ్య, రాజారామ్, మారుతి పాల్గొన్నారు.